అడగకుండానే మహిళా సంఘానికి రుణం

- బ్యాంకు అకౌంట్‌లో రూ.29లక్షలు వేసిన అధికారులు
- నెల రోజులకు రూ.14లక్షలు రివర్స్, రూ.11వేల వడ్డీ కట్
- నిలదీసిన గ్రూపు సభ్యులు

సంగెం, డిసెంబర్ 9 : మహిళా సంఘం సభ్యులు రుణం కావాలని అడగకుండానే బ్యాంకు అధికారులు వారి అకౌంట్‌లో రూ.29 లక్షలు వేశారు. ఇది తెలియక గ్రూపు సభ్యులు ప్రతి నెలా బ్యాంకుకు వెళ్లి గతంలో తీసుకున్న రుణానికి సంబంధించిన డబ్బులను చెల్లిస్తూ వస్తున్నారు. ఇలా ఏడెనిమిది నెలలుగా జరుగుతోంది. సంగెం మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని శ్రీనివాస్ గ్రూపు సభ్యులు బ్యాంకు రుణం కోసం ఎలాంటి తీర్మానాలు చేసుకోలేదు. కానీ వారి అకౌంట్‌లో మార్చి 16న రూ.14.20లక్షలు వేశారు. తిరిగి ఏప్రిల్ 18న రివర్స్‌గా బ్యాంకులో జమచేసుకున్నారు. అలాగే, సెప్టెంబర్ 19న మరో 15.16లక్షలు జమ చేశారు. వీటికి గాను అక్టోబర్ 3న రూ.11వేలు వడ్డీ కట్‌చేసుకున్నారు. గత నెలలో బ్యాంకులో డబ్బులు వేయడానికి వెళ్లిన ఒకరు అకౌంట్ బుక్ ప్రింట్ తీయడంతో ఈ వివరాలు బయటపడ్డాయి. దీంతో అవాక్కైన సభ్యులు సోమవారం బ్యాంకుకు వెళ్లి మేము దరఖాస్తు చేయక ముందే ఎలా డబ్బులు వేశారు? విషయం చెప్పకుండా ఎందుకు రివర్స్‌లో వేసుకున్నారని అధికారులను నిలదీశారు. దీనికి బ్యాంకు అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని గ్రూపు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు, వీవోఏలు కుమ్మక్కై ఇలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. గతంలో ఇదే గ్రామంలో పలు గ్రూపులకు రూ.50వేలు చొప్పున ఇన్సూరెన్స్ చేయించి వారికి బాండ్స్ ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయమై ఏపీఎం కిషన్‌ను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని, గ్రూపు సభ్యులు దరఖాస్తు చేసుకుంటేనే బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ఒక వేళ వీవోఏ తప్పు చేసినట్లయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బల్దియా గ్రీవెన్స్‌లో వినతుల వెల్లువ

వినతులు స్వీకరిస్తున్న గ్రేటర్ కమిషనర్

వరంగల్, డిసెంబర్ 9 : బల్దియా గ్రీవెన్స్‌లో వినతులు వెల్లువెత్తాయి. కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు విన్నవించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ వినతులు స్వీకరించారు. ఎక్కువగా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫిర్యాదులు చేశారు. 26వ డివిజన్ లక్ష్మీ టాకీస్ వెనుక రోడ్డు పనులను నిలిపివేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని కాలనీ వాసులు కమిషనర్‌ను కోరారు. పుప్పాలగుట్ట విఘ్నేశ్వర కాలనీలో డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. 31వ డివిజన్ డాక్టర్స్ కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు విన్నవించారు. 32వ డివిజన్ బీరన్నకుంటలోని ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకుడు సింగారపు బాబు కమిషనర్‌ను కోరారు. కరీమాబాద్ పోచమ్మగుడి పక్కన ఉన్న ఆరెకటిక శ్మశాన వాటికలో కనీస వసతులు కల్పించాలని సంఘం నాయకులు విన్నవించారు. సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వింగ్ అధికారులు గీవెన్స్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రీవెన్స్‌లో 84 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 42, ఇంజినీరింగ్ విభాగం 21, ప్రజారోగ్య విభాగం 8, పన్నుల విభాగం 2, తాగునీటి సరఫరా 5, హార్టికల్చర్ 1, సాధారణ విభాగం 5 వినతులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వో రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకరలింగం, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్రరాధేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో రాజేశ్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

కాశీబుగ్గ, డిసెంబర్ 9 : నగరంలోని 3వ డివిజన్ రాఘవేంద్రకాలనీలో దాడికి పాల్పడిన ఏఆర్ కానిస్టేబుల్ యుగేంధర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు పిన్నింటి ప్రకాశ్‌రావు ఏనుమాముల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కానిస్టేబుల్ యుగేంధర్‌తో పాటు అతడి భార్య కుటుంబ సభ్యులు బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎనుమాముల ఎస్ఐ రాజు విచారణ చేపడుతుండగా తనపై దాడికి పాల్పడినట్లు తెలిపారు.

'రోడ్డు కబ్జా చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు'

కాశీబుగ్గ, డిసెంబర్ 9 : నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లిలో రంగనాయకుల దేవునిగుట్ట సమీపంలో రోడ్డును కబ్జా చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు బోయిని అయిలయ్యపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పైడిపల్లిలోని సర్వే నెంబర్ 1255లో ప్లాట్లను కొందరు కొనుగోలు చేశారని, ఆ పాట్లకు వెళ్లే రోడ్డును అయిలయ్య కబ్జా చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు తెలిపారు. సోమవారం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై రాజు వచ్చి పరిశీలించినట్లు పేర్కొన్నారు. అయినా పోలీసుల ముందే దుర్భాషలాడుతూ దాడికి పాల్పడే ప్రయత్నం చేశాడని ఫిర్యాదులో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో ఇలా చేస్తున్నట్లు ఆరోపించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, ANKALLA ANITHA (Old Name) H.No.3-160 Venkatraopalli (B), Tekumatla Mdl, Jayashankar Bhupalpally Dist-506356, T.S. Changed my name as ANKALLA VANITHA W/o ANKALLA SWAMY (New Name). for all purpose.
NTW-000

పేరు మార్పు
నేను అనగా మహేందర్ కర్ర, తండ్రి: దశరథం కర్ర, వ: 45 సం॥లు, వృత్తి: వ్యవసాయం, నివాసం : ఇం.నెం. 2-111, గ్రామం : ములకపల్లి, మండలం: మొగుళ్లపల్లి, జిల్లా: జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ. పిన్: 506366. నా పూర్వపు పేరయిన మహేందర్ కర్ర వాడకాన్ని మార్చుకుంటున్నాను. కావున ఇప్పటి నుండి నా పేరు కర్ర మహేందర్ రెడ్డి గా మార్చబడుచున్నది. దీని ప్రకారమే ఇక మీదట నాయొక్క రికార్డులలో మరియు లావాదేవీలలో ఈ పేరు ప్రకారమే జరుపబడును.
- కర్ర మహేందర్ రెడ్డి

SKY ASSOCIATES- WANTED
★Area collection executives, Telecallers, Experience is not required Locations: Warangal, Narsampet, Wardhannapeta, Thorrur, Parkal, Mulugu, Ghanpur,-Cont 9491465729
NTW-332306

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED
★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338976-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

నల్లబెల్లి : పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

దుగ్గొండి : అరెస్టు అయిన మాజీ సర్పంచ్‌లు

రాయపర్తి పోలీస్ స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌లు

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు

చెన్నారావుపేట/దుగ్గొండి/నల్లబెల్లి/రాయపర్తి, డిసెంబర్ 9 : పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి బయలు దేరిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. చెన్నారావుపేట మండలంలో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను స్థానిక పోలీసులు అరెస్టు చేసినట్లు సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుండె మల్లయ్య తెలిపారు. బిల్లులు చెల్లించే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అనుముల కుమారస్వామి, భిక్షపతి, అంద్ర విజయాబాలజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, దుగ్గొండి మండలంలో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం తగదని మోడెం విద్యాసాగర్, రేవూరి సురేందర్ రెడ్డి, ఒడెటి తిరుపతి రెడ్డి అన్నారు. నల్లబెల్లి మండలంలో అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని మాజీ సర్పంచ్‌లతోపాటు దివ్యాంగులు అన్నారు. అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లతోపాటు పలువురు దివ్యాంగులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నానెబోయిన రాజారాం, తం గెళ్ల రవీందర్‌రెడ్డి, నునావత్ వెంకన్ననాయక్, ఊరటి అమరేందర్‌రెడ్డి, దివ్యాంగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు అడ్డ రాజు, ఉపాధ్యక్షుడు చింత కుమార్, మండల అధ్యక్షుడు ఈదునూరి విజయ్, మంద రవి ఉన్నారు. రాయపర్తి మండలంలో పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను వేకువజామునే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో గారె నర్సయ్య, బోనగిరి ఎల్లయ్య, కోదాటి దయాకర్‌రావు, భూక్యా భద్రూనాయక్, కుక్కల భాస్కర్‌తోపాటు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి, నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, ఆకుల సురేందర్‌రావు, ఎండీ నయీం, పూస మధు, చిన్నాల రాజబాబు, చిన్నాల లక్ష్మీనారాయణ, ముద్రబోయిన సుధాకర్, గబ్బెట యాకయ్య, చందునాయక్, సుధాకర్ ఉన్నారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 9 : సెమీస్కిల్డ్ కార్మికులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వరంగల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఉమా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. బైక్ రైడర్ అభ్యర్థులు కనీసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగి, రెండేళ్ల పాత డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, 21 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండాలని సూచించారు. సెక్యూరిటీ గార్డు కోసం కనీసం ఇంటర్మీడియట్, ఎత్తు 5.8 అడుగులు ఉండి, 21 నుంచి 32 ఏళ్ల మధ్య వయసు ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 13న వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ క్యాంపస్‌లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94400 50951, 94400 49861, 94400 51452 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గుట్కా, పొగాకు ఉత్పత్తుల పట్టివేత

గిర్మాజీపేట, డిసెంబర్ 9 : గుట్కా, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ ఎంఏ షుకూర్ తెలిపారు. చార్‌బౌళీకి చెందిన శనిగరపు వెంకటనారాయణ అనుమతుల్లేని గుట్కా, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది అతడి ఇంటిపై దాడిచేసి, రూ.70 వేల విలువైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మిషన్ భగీరథ పైపు అపహరణ

వర్ధన్నపేట, డిసెంబర్ 9 : ప్రజలకు తాగునీటిని సరఫరా చేయడం కోసం వేసిన మంచినీటి పైపులైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన వర్ధన్నపేట సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట ఆకేరువాగుపై ఉన్న పాత బ్రిడ్జిపై తాగునీటిని సరఫరా కోసం ప్రభుత్వం ఇనుప పైపులైన్ వేసింది. కొంత కాలంగా సరఫరా జరుగడం లేదు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి పైపులైన్‌ను సుమారు 40 ఫీట్ల మేరకు గ్యాస్ కట్టర్లతో కత్తిరించి అపహరించారు. వాగుపై పైపులైన్ కత్తిరించి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మిషన్‌భగీరథ అధికారులకు సమాచారం ఇచ్చారు.

గుండెపోటుతో కూలీ మృతి

ఖానాపురం, డిసెంబర్ 9 : గుండెపోటుకు గురై ఉపాధికూలీ మృతిచెందాడు. బుధరావుపేటకు చెందిన పొల్కం సోమయ్య(65) సోమవారం ఉదయం ఉపాధి పనికి వెళుతుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు నర్సంపేటలోని దవాఖానకు తరలించారు. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి ఇద్దరి సస్పెన్షన్

దుగ్గొండి, డిసెంబర్ 9 : మల్లిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అంబీరు రమేశ్, అంబీరు శివాజీ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున మండల కమిటీ నిర్ణయం మేరకు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్‌రావు తెలిపారు.

మంత్రి కొండా సురేఖ దాటవేత ధోరణి వీడాలి

- రాజన్న కోడెల అమ్మకంపై సమగ్ర విచారణ జరిపించాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గీసుగొండ, డిసెంబర్ 9 : వేములవాడ రాజన్న కోడెలను అక్రమంగా తెచ్చి అమ్ముకున్న వ్యవహారంలో రాష్ట్ర దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ వాస్తవాలను కప్పి పుచ్చి, దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారని గీసుగొండ మండల బీఆర్ఎస్ సమన్వయ కమిటీ నాయకులు ఆరోపించారు. సోమవారం కోటగండి పీడీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్లా వేణుగోపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, జక్కు మురళి మాట్లాడారు. మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ తన సిఫార్సు లెటర్‌తో మాదాసి రాంబాబు కోడెలను తెచ్చి, అమ్ముకున్న విషయం బయటకు వచ్చినా అది వాస్తవం కాదని చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ జరిపించి, దోషులపై కఠిన చర్యలు తీసుకునేలా మంత్రి ఆదేశాలు జారీ చేయాలన్నారు. రాంబాబుకు గతంలో ఇందిరమ్మ ఇళ్లు, లోన్లు ఇప్పిస్తానని అమాయకులను మోసం చేయడం, పోలీస్ స్టేషన్‌లో పంచాయితీలు, పైరవీలు చేసి, అనేక గొడవల్లో తలదూర్చి ఎస్సీ, ఎస్టీ కేసులను పెట్టించడంలాంటి చరిత్ర ఉందన్నారు. అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున అందోళనలు చేస్తామని హెచ్చరించారు. రాంబాబు ఆలయాల గోశాలల నుంచి తెచ్చిన కోడెలను కబేళాలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని అన్నారు. ఈ పాపం మంత్రి కొండా సురేఖకు అంటుకుంటుందన్నారు. రాంబాబు 60 కోడెలు తెస్తున్న క్రమంలో కొన్ని పారిపోయాయని, మరి కొన్ని చనిపోయాయని చెప్పడం వాస్తవం కాదన్నారు. సమావేశంలో నాయకులు ముంత రాజయ్య, గుర్రం రఘు, కొట్టుల కట్టయ్య, మండల యూత్ అధ్యక్షుడు శిరిశే శ్రీకాంత్, కోట ప్రమోద్, సంతోశ్ పాల్గొన్నారు.

విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న పరమేశ్వర్

కొండా సురేఖ రాజీనామా చేయాలి

కాశీబుగ్గ : మంత్రి కొండా సురేఖ వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సముద్రాల పరమేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం కాశీబుగ్గ చౌరస్తాలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి బాకం హరిశంకర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి గోశాలలు లేని వ్యక్తికి మంత్రి కొండా సురేఖ వేములవాడలోని 60 గోవులను సిఫార్సు లేటర్‌తో ఇవ్వడం సరికాదన్నారు. మంత్రిగా సురేఖ గోవులను కబేళాలకు తరలించేందుకు సహకరించారని ఆరోపించారు. నాయకులు బాకం హరిశంకర్, బైరి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్' పరిష్కార వేదిక

పోచమ్మమైదాన్, డిసెంబర్ 9 : వరంగల్ దేశాయిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి మాట్లాడుతూ వినియోగదారులు సమస్యలను స్థానిక అధికారులకు నేరుగా తెలుపాలని సూచించారు. కాగా, రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని, వంగి ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కార్పొరేటర్ సురేశ్‌కుమార్ జోషి కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ కే రమేశ్, ఆర్ చరందాస్, ఎం రామారావు, ఏఈ అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటలో షూటింగ్

ఖిలావరంగల్, డిసెంబర్ 9 : ఓరుగల్లు కోటలో సినిమా సందడి నెలకొంది. కీర్తితోరణాల ప్రాంగణంతోపాటు ఏకశిల పార్క్‌లో 'ఓ బామ్మ.. అయ్యో రామ' సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరోగా సుహస్, హీరోయిన్‌గా మాలవిక నటిస్తున్నారు.

మరోసారి బయటపడ్డ తూర్పు కాంగ్రెస్ వర్గ విభేదాలు

ఎవరికీ వారే సోనియా జన్మదిన వేడుకలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 9 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పార్టీలోని నాయకుల వర్గ విభేదాలు బయటపడ్డాయి. పోచమ్మమైదాన్ సెంటర్ అడ్డాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి 'ఎవరికీ వారే యమున తీరే' అన్నట్లు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఇప్పటికే వరంగల్ తూర్పులో రెండు వర్గాలుగా ఉన్న నాయకులు ఒకతాటిపై రాకపోవడంతో ఇంకా వీరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. జిల్లా, రాష్ట్రస్థాయి నాయకత్వం కూడా అంటి అంటనట్లు ఉండటంతో రెండు వర్గాల కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. కొంతమంది కార్యకర్తలు తాము ఒక వర్గానికి ముద్ర పడితే భవితవ్యం ఎలా ఉంటుందోనన్న ఆందోళన వెలిబుచ్చుతున్నారు. సోమవారం ఉదయం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లను పంపిణీ చేశారు. ఇందులో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, మధ్యాహ్నం పార్టీ నాయకుడు గోపాల నవీన్‌రాజు ఆధ్వర్యంలో కూడా కేక్ కట్ చేసి, పండ్లను పంపిణీ చేశారు. అలాగే, అన్నదానం చేపట్టారు. ఇందులో స్థానిక కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్లు, కొండా వర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, 13వ డివిజన్‌లో, 21వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కొత్తవాడలో చేనేత కార్మికులను సన్మానించారు.

వైభవంగా అయ్యప్పస్వామి పంబారట్టు

- శరణుఘోషతో మార్మోగిన నర్సంపేట
- కిటకిటలాడిన మాదన్నపేట పెద్ద చెరువు
- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి-స్వప్న దంపతులు

అయ్యప్పకు జలక్రీడలు నిర్వహిస్తున్న గురుస్వాములు

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, ప్రజలు

నర్సంపేట రూరల్, డిసెంబర్ 9 : నర్సంపేట శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో 24వ (చతుర్వింశతి) మండల పూజ మహోత్సవాల్లో భాగంగా నర్సంపేట మండలం మాదన్నపేట పెద్ద చెరువులో పంబారట్టు ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తొలుత పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి-స్వప్న దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ప్రత్యేక ఊరేగింపు వాహనంపై స్వామివారిని ప్రతిష్ఠించారు. వేలాది మంది దీక్షాపరులు, భక్తుల ఆధ్వర్యంలో ఊరేగింపు ప్రారంభమైంది. ఊరేగింపు వాహనాన్ని పెద్ది సుదర్శన్‌రెడ్డి స్వయంగా కిలో మీటర్ వరకు నడిపారు. అయ్యప్ప గుడి నుండి ప్రారంభమైన ఊరేగింపు వరంగల్ రోడ్డు, అంగడిసెంటర్, అంబేద్కర్ సెంటర్, జయలక్ష్మీ సెంటర్, కమలాపురం మీదుగా మాధన్నపేట పెద్ద చెరువు కట్టవద్దకు సాగింది. పట్టణంలోని ప్రధాన వీధుల్లో మాలాధారులు భజనలు, విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కేరళ ప్రాంతం నుంచి వచ్చిన వాయిద్యాలు, కళాకారులు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షనగా నిలిచారు. తాంత్రిక వేత్త, గురుస్వామి వెంకటేశ్‌శర్మ ఆధ్వర్యంలో మాదన్నపేట పెద్ద చెరువు వద్ద అయ్యప్పకు జలక్రీడలు నిర్వహించారు. అలాగే, తేనే, పండ్లు, జీడిపప్పు, చెక్కర, పెరుగు, పాలు, క్షీరం, కొబ్బరినీరు, విభూది, పసుపు, గంధం, వివిధ రకాల పుష్పాభిషేకాలు చేశారు. వేడుకలను తిలకించడానికి మాలదారులు పోటీ పడ్డారు. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి-స్వప్న దంపతులు 10వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి పవిత్ర జలాలతో ఏటా అయ్యప్పకు వైభవంగా జలక్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21ఏళ్లుగా పంబా సద్దిని సమకూర్చే గొప్ప అవకాశాన్ని తనకు కల్పించడం సంతోషకరమన్నారు. గతంలో మాదన్నపేట పెద్ద చెరువు అభివృద్ధికి శక్తి మేరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. నర్సంపేట టౌన్, రూరల్, నెక్కొండ సీఐలతో పాటు డివిజన్‌లోని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, నర్సంపేట, ఖానాపురం, నల్లబెల్లి మండలాల మాజీ ఎంపీపీలు మోతె కళావతి, వేములపల్లి ప్రకాశ్‌రావు, ఊడ్గుల సునీత-ప్రవీణ్‌కుమార్, మాజీ జడ్పీటీసీలు కోమాండ్ల జయ, బానోతు పత్తినాయక్, అర్చకులు శ్రీదేవేశ్ మిశ్రా, మున్సిపల్ కౌన్సిలర్లు నాగిశెట్టి పద్మ-ప్రసాద్, దేవోజు తిరుమల-సదానందం, దార్ల రమాదేవి, రాయిడి కీర్తిరెడ్డి-దుశ్యంత్‌రెడ్డి, పాషా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సైప సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, కమిటీ సభ్యులు మాధారపు చంద్రశేఖర్, శ్రీరాం ఈశ్వరయ్య, వంగేటి గోవర్ధన్, చకిలం కృష్ణమూర్తి, పిన్న రామనాథం, శింగిరికొండ వేణుగోపాల్, భూపతి లక్ష్మీనారాయణ, శ్రీరాముల శంకరయ్య, ఇరుకుల్ల వీరలింగం, మిడిదొడ్డి బాబురావు, దొడ్డ వేణు, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

జిల్లాలో గ్రూప్-2కు 28 పరీక్ష కేంద్రాలు

ఖిలావరంగల్, డిసెంబర్ 9 : జిల్లాలో గ్రూపు-2 పరీక్షను 10,310 మంది అభ్యర్థులు రాస్తున్నట్లు అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి తెలిపారు. ఈ నెల 15, 16తేదీల్లో జరిగే పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదుగురిని రూట్ ఆఫీసర్లుగా, 28 మందిని డిపార్ట్‌మెంట్ అధికారులు, ప్రతి కేంద్రానికి 5 నుంచి 10 మంది జూనియర్ అసిస్టెంట్లను గుర్తింపు అధికారులుగా నియమించామన్నారు. ఆర్టీసీ బస్సులను పరీక్ష సమయానికి అనుగుణంగా నడిపించాలని ఆర్టీసీ డీఎం వీ మోహన్‌రావును ఆదేశించారు. విద్యుత్‌లో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే, పరీక్ష కేంద్రాల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావుకు ఆదేశాలు జారీ చేశారు. అదనపు డీసీపీ రవి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో బందో బస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చౌరస్తా, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

రాయపర్తిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

అరెస్టుతో ఆగ్రహ జ్వాలలను ఆపలేరు

రాయపర్తి, డిసెంబర్ 9 : ఆరు గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని సకల వర్గాలను చేయిస్తున్న అరెస్టులు ఆగ్రహ జ్వాలలను ఆపలేవని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసగిస్తోందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాలు చేస్తున్న ఆశ వర్కర్లు, మాజీ సర్పంచ్‌లు, పోలీస్ ఉద్యోగులు, హోంగార్డులను ముప్పుతిప్పలు పెడుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కండ్లు తెరచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, ఆకుల సురేందర్‌రావు, మహ్మద్ నయీం, పూస మధు, కోదాటి దయాకర్‌రావు, చిన్నాల రాజబాబు, భూక్యా భద్రునాయక్, చిన్నాల లక్ష్మీనారాయణ, భాషబోయిన సుధాకర్, రవీందర్, చందునాయక్ పాల్గొన్నారు.

కేటీఆర్ సేన పరకాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా అభిషేక్

నియామక పత్రం అందుకుంటున్న అభిషేక్

గీసుగొండ, డిసెంబర్ 9 : కేటీఆర్ సేన పరకాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఎలుకుర్తి గ్రామానికి చెందిన ఐలోని అభిషేక్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధ్యక్షుడు వైనాల నరేశ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ప్రజా పాలన కాదు నిర్బంధ పాలన

బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

నర్సంపేటరూరల్, డిసెంబర్ 9 : ఆశ వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన కార్యక్రమానికి వెళుతుండగా వైద్య అధికారులు బెదిరింపులకు పాల్పడడం శోచనీయమని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగే ఆశ కార్యకర్తల ధర్నాకు వెళుతున్న వారిని జిల్లా వైద్యాధికారులు సస్పెండ్ చేస్తామని మెసేజ్‌లు పెట్టి బెదిరించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ సమస్యలపై నిరసన తెలిపే హక్కు కూడ లేదా? అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థులు ఎంపిక

మరియం

సభిహా

నర్సంపేట రూరల్, డిసెంబర్ 9 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలోని ద్వారకపేట ముస్లిం మైనార్టీ గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీపాల తెలిపారు. సోమవారం గురుకులంలో ఆమె మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు మరియం, సభిహా ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన అసోసియేషన్ గేమ్స్ అండర్-19 జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కార్పొరేటర్‌కు మాతృ వియోగం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 9: వరంగల్ 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి తల్లి బస్వరాజు సరోజన(69) సోమవారం సాయంత్రం మృతిచెందారు. మూడు రోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆమె ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆమెకు గుండెపోటు రావడంతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న మంత్రి కొండా సురేఖ ఫోన్ ద్వారా కార్పొరేటర్‌ను పరామర్శించారు. అలాగే, మేయర్ గుండు సుధారాణి శ్రద్ధాంజలి ఘటించారు. కొత్తవాడలోని శ్మశాన వాటికలో మంగళవారం అంత్యక్రియలు జరుగనున్నాయి.

పన్నులు వంద శాతం వసూలు చేయాలి

వరంగల్, డిసెంబర్ 9 : గ్రేటర్‌లో వంద శాతం ఆస్తి, నీటి పన్నుల సేకరణ జరగాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం ఆమె కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో పన్నుల వసూళ్లు, భువన్ యాప్ అంశాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి రూ.113 కోట్ల పన్నుల వసూళ్లకు గాను, ఇప్పటి వరకు కేవలం రూ.40 కోట్లు వసూలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో 15 రోజుల్లో పన్నుల వసూళ్లు 60 శాతానికి చేరుకోవాలని ఆదేశించారు. గ్రేటర్‌లో మ్యుటేషన్ అయిన కొత్త గృహాలను గుర్తించి పన్ను మదింపు చేయాలన్నారు. భువన్ యాప్‌లో గృహాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్ర రాధేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు. కాగా, సీఎం కప్ నిర్వహణకు బల్దియా ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని మేయర్ ఆదేశించారు.

మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

చెన్నారావుపేట/దుగ్గొండి/రాయపర్తి/, డిసెంబర్ 9: తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. చెన్నారావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షలో ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శ్రీజ, సాత్విక్ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు హెచ్ఎం జయ తెలిపారు. వారికి కాంప్లెక్స్ హెచ్ఎం పాపమ్మ ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే, దుగ్గొండిలో జరిగిన పరీక్షలో మల్లంపల్లి పాఠశాల విద్యార్థి సన్ని, నాచినపల్లి పాఠశాల విద్యార్థి కే దినేశ్, దుగ్గొండి పాఠశాల విద్యార్థి కే ఈశ్వర్ ప్రతిభ చూపినట్లు హెచ్ఎం రామస్వామి తెలిపారు. రాయపర్తిలో జరిగిన పరీక్షలో జీ సాయివర్ధన్, వర్షిత్‌రెడ్డి, రామ్‌చరణ్ ప్రతిభ కనబర్చగా హెచ్ఎం, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.